విల్లాస్‌లోని సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీనివాస కాలనీ లేక్‌ వ్యూ విల్లాస్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్‌ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్‌ సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ రమేష్‌, ఏఈ రాజీవ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహదేవ్‌, కాలనీ వాసులు మాధవరావు, నాగిరెడ్డి, శ్రీనివాస్‌, కొలన్‌ సంజీవరెడ్డి, కొలన్‌ చంద్రమోహన్‌ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బన్నయ్య, సంపత్‌, వెంకట్‌, యాదిరెడ్డి, నాయకులు నిరంజన్‌ గౌడ్‌, మాధవరావు, నిఖిల్‌, హమీద్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: చెరువుల సుందరీకరణ, ఇతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని అంబీర్‌ చెరువు, ఆలీతలాబ్‌ చెరువు, భీముని కుంట, కింది కుంట, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఎల్లమ్మ చెరువుల సుందరీకరణ పనులు, అభివృద్ధి పనుల పురోగతిపై ఇరిగేషన్‌ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనుల్లో వేగం పెంచాలని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని చెప్పారు. గుర్రపు డెక్క తొలగించి దోమల బెడదను నివారించాలన్నారు. కార్యక్రమంలో డీఈ నరేందర్‌, ఏఈ విశ్వం పాల్గొన్నారు.

కల్వర్టుతో ఉపశమనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌ వద్ద రూ.1.90 కోట్ల వ్యయంతో కల్వర్టు నిర్మాణం , వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌ నుంచి మాధవరం నగర్‌కాలనీ హైటెన్షన్‌ లైన్‌ కింద నాలా మీద నిర్మించిన కల్వర్టు వరకు రూ.24.65 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు, కాలనీ వాసులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ ఆశ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ గురివిరెడ్డి, నాయకులు నాయినేని చంద్రకాంత్‌ రావు, గౌతంగౌడ్‌ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూల తీర్పును స్వాగతిస్తున్నామని, కోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. 50 సంవత్సరాల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ విషయాన్ని తెరమీదికి తీసుకొచ్చి మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిన మంద కృష్ణమాదిగకు, ఉద్యమకారులకు, మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకు అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం


మాట్లాడుతున్న ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ జ్యోతి

మూసాపేట: మూసాపేటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మూసాపేటలోని హరిజన వాడ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో, భరత్‌నగర్‌ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ జ్యోతి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు స్వప్న, బసమ్మ, ఆశ వర్కర్‌ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు

వివాహం కావడం లేదని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్‌: వివాహం కావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌ బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి మున్సిపల్‌ గాంధీనగర్‌కు చెందిన విష్ణుప్రసాద్‌(35) ఎలక్ట్రీషియన్‌. తన తల్లితో కలిసి నివాసముంటున్నాడు. వయసు పెరుగుతున్నా వివాహం కాకపోవడంతో గత నెల 31వ తేదీన అతడి తల్లి పనిపై బయటకు వెళ్లగా ఇంట్లోని సీలింగ్‌ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఊట్ల చంద్రారెడ్డి, ప్రాజెక్టు అధికారి ఇంద్రసేన తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాపిరెడ్డినగర్‌ బస్తీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రాజెక్టు అధికారి ఇంద్రసేన అన్నారు. గురువారం కూకట్‌పల్లి సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణ, వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై వీధుల్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో ఉండే నీటి వ్యర్థాలను, పాత సామాన్లను తొలగించుకోవాలని సూచించారు. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందుతాయని, అదే విధంగా చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఓ సుజాత, ఎస్‌ఎల్‌ఎఫ్‌ అధ్యక్షురాలు పద్మావతి, వి.శోభారాణి, రేణుక, పి.లక్ష్మి, కె.పద్మ, వెంకట లక్ష్మి, సులోచన, ఎంటమాలజీ సిబ్బంది నరేష్‌, ఆర్పీలు రాణి, స్వర్ణ, స్వాతి, స్వప్న, సరిత, సంగీత, ప్రమీల, రమాదేవి, పద్మావతి, కవిత, రాధ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్‌ ఏర్పాటు చేయరూ..

వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ పక్క నుంచి వెళ్లాలంటే ప్రాణాలతో చెలగాటమే


ఎర్తింగ్‌ లేని ట్రాన్స్‌ఫార్మర్‌

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ యూసుఫ్‌ నగర్‌ శ్మశాన వాటిక రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్‌ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్చుతగ్గులతో విద్యుత్‌ సరఫరా కావటంతో పాటు భారీ వర్షాలు కురిసినప్పుడు ఇళ్లల్లోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, టీవీలు, ఫోన్‌లు విలువైన విద్యుత్‌ పరికరాలు కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ పక్క నుంచి కూకట్‌పల్లికి, హైటెక్‌ సిటీకి మార్గ మధ్యన దారి కావటంతో తరచూ ఆ రోడ్డు ఎప్పుడు చూసినా జన సంచారంతో పాటు వాహనాలతో సందడిగా ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆదమరిచి ట్రాన్స్‌ఫార్మర్‌ పక్క నుంచి వెళితే విద్యుత్‌ సరఫరాతో ఎప్పుడు ఎవరికి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్‌ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహిళ అదృశ్యం


చిట్టి

మోతీనగర్‌: పనికోసం వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. అల్లాపూర్‌ సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. సుల్తాన్‌ షాహిలో నివాసముండే కొడవత్‌ చిట్టి (31) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. పని కోసం మరో మహిళ శాంతితో కలిసి రైలులో ఉప్పుగూడ నుంచి బోరబండ రైల్వే స్టేషన్‌లో రైలు దిగి పని ప్రాంతానికి 26వ తేదీన వెళ్లింది. 28న యజమాని శంకర్‌తో గొడవ పడి సాయంత్రం అక్కడి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఆమె ఇంటికి చేరుకోలేదు. దీంతో సోదరుడు వర్తియావత్‌ శంకర్‌ కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా సమాచారం అందలేదు. అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ


ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో సంబురాల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడిందని కంటోన్మెంట్‌ ఇన్‌చార్జి ఇటుక కిషన్‌, అజిత్‌ కల్యాణ్‌ వాల్మీకి, బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ పరుశురాం అన్నారు. ఎమ్మార్పీఎస్‌ డివిజన్‌ ఇన్‌చార్జి మంద మధుకర్‌, బ్యాగరి నరసింహ ఆధ్వర్యంలో గురువారం ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో అంబేద్కర్‌ విగ్రహం వద్ద సంబురాలు జరుపుకున్నారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుండాల జగదీష్‌, బాబేందర్‌, రాజు, నవీన్‌, కుమార్‌, రాఖేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మూసాపేట: మూసాపేట మైసమ్మ చెరువు వద్ద గుర్తు తెలియని కుళ్లిన మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మైసమ్మ చెరువు సమీపంలోని పొదల్లో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మృతదేహం కుళ్లిపోయి ఉంది. మృతుడి కుడి చేతిపై 'బి' అనే అక్షరం పచ్చబొట్టు ఉంది. సుమారు నెల రోజుల క్రితం బండరాయితో తలపై బాది హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాలానగర్‌ డీసీపీ సురేష్‌ కుమార్‌, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు మాస శివరాత్రి పూజలు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌ ప్రధాన రోడ్డులోని పర్వతవర్ధిని శివాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు శివుడికి అన్నాభిషేకం, అన్నప్రసాదం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు అవినాష్‌ శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహా మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుద్రహోమం, మృత్యుంజయ హోమం, 7 గంటలకు నందీశ్వరుని పరమేశ్వరునికి రుద్రాభిషేకం, విశేషాలంకరణ, హారతి వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

శివరామాంజనేయ స్వామి ఆలయంలో..

కబీర్‌నగర్‌, మోతీనగర్‌ ఎక్స్‌టెన్షన్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా పరమేశ్వరునికి విశేష రుద్రాభిషేకాలు, 9 గంటలకు 108 రుద్రాక్ష మాలలతో అర్చనలు జరుగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 6.30 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం


చిరుమర్తి రాజు

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ యూత్‌ జేఏసీ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు చిరుమర్తి రాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందన్నారు. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు.


కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్‌ బస్టాప్‌ వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, శిరీష బాబూరావు తదితరులు


నిరసనలో పాల్గొన్న వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి, బీఆర్‌ఎస్‌ శ్రేణులు

భగ్గుమన్న బీఆర్‌ఎస్‌

- మహిళా ఎమ్మెల్యేపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్‌
- నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు

కూకట్‌పల్లి: మహిళా ఎమ్మెల్యేపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం నియోజకవర్గంలోని పలువురు బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీనియర్‌ నాయకురాలైన సబితా ఇంద్రారెడ్డిని అవమానపరిచినట్లు మాట్లాడటం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగదన్నారు. సీఎం చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, సబితారెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.


అల్లాపూర్‌ గాయత్రినగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగం, నాయకులు


కూకట్‌పల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్‌


ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌ శ్రేణులు